క్లుప్తంగా

వీరవాసరంలో ఫ్లాగ్ మార్చ్


వీరవాసరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎన్నికల బందోబస్తుపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. వీరవాసరంలో 92 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరవాసరం పాలిటెక్నిక్ కళాశాలకు ప్రత్యేక సీఐఎస్ఎఫ్ బృందాలు రావడం జరిగింది అన్నారు. సాయంకాలం వీరవాసరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ముగింపు వరకు ఈ సిబ్బంది ఇక్కడే ఉంటారని, మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని ఎస్సై పి.రమేష్, పాలకోడేరు ఎస్సై నాలం శ్రీనివాస్ తెలిపారు.

పేపర్ ప్రజెంటేషన్‌లో విష్ణు విద్యార్థులకు బహుమతులు


బహుమతులు గెల్చుకున్న విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన డాక్టర్ జీవీ రావు యంగ్ ఇంజనీర్ డ్రీమర్ అవార్డ్స్ పేపర్ ప్రజెంటేషన్‌లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ మంగం వేణు చెప్పారు. సోమవారం బహుమతులు గెల్చుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 70 విద్యార్థి బృందాలు పాల్గొనగా ఆరు బృందాలు ఫైనల్స్‌కు చేరాయన్నారు. వాటిలో విష్ణు కళాశాల విద్యార్థులు రూపొందించిన యూటిలిజేషన్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్స్ ఫర్ ప్రీకాస్ట్‌బిల్డింగ్ కంపోనెంట్స్ అనే అంశానికి మొదటి బహుమతిగా రూ. 50 వేలు అందుకున్నారన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మింగ్ ప్లాస్టిక్ వేస్ట్ ఇన్ టు ప్యూయల్ అండ్ పవర్ బ్లాక్స్ అనే అంశానికి ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు నగదు అందుకున్నట్లు వేణు వివరించారు. ఈ సందర్భంగా బహుమతులు అందుకున్న విద్యార్థులు వారిని ప్రోత్సహించిన ఫ్యాకల్టీ మెంటార్స్‌ను కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ వేణు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, వీవీఏస్ శర్మ తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో మంగళవారం 11కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతులు నిమిత్తం రామాయణపురం, దిరుసుమర్రు ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్లకు విద్యుత్ సరఫరా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 వరకు నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళ గత కొంతకాలంగా భర్తతో విబేధాల కారణంగా పుట్టింట్లోనే ఉంటుంది. అయితే ఈ నెల 3వ తేదీ ఆదివారం ఉదయం నుంచి ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబికులు ప్రయత్నించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో వివాహిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయాలు


సచివాలయ ప్రారంభోత్సవ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

ఉండి: గ్రామ సచివాలయాల నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. మండలంలోని చిలుకూరులో సచివాలయ భవనం, పెదపుల్లేరులో సచివాలయ భవనంతో పాటుగా వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలు మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభోత్సవం కానున్నాయి. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా ప్రారంభోత్సవాల్లో పాల్గొంటున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, చిలుకూరు గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- జగనన్నతోనే సుపరిపాలన
- ఇళ్ల పట్టాల పంపిణీ సభలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


యండగండిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు భావించి ముందుకు సాగుతున్నారని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం యండగండిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన 250 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అధ్యతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. పేదరికాన్ని దూరం చేసేందుకే ప్రభుత్వ విద్యలో అధునాతన మార్పులు తెచ్చి ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టారని అన్నారు. గతంలో మాదిరి కాకుండ జన్మభూమి కమిటీల పీడ లేకుండా నేరుగా అర్హుల ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్ములు నేరుగా చేరవేస్తున్నారన్నారు. యండగండిలో రూ.60 కోట్ల సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీసీరోడ్లు, సీసీ డ్రెయిన్‌లు, ఓహెచ్ఎస్ఆర్(వాటర్ ట్యాంక్‌లు),పైపులైన్‌ల విస్తరణ పనులను చేపట్టామన్నారు. నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు మండలాల్లో రూ.100 కోట్లుతో ఆర్అండ్‌బీ రోడ్లు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నారని తెలిపారు. వలంటీర్ల ద్వారా అవినీతికి తావులేని పరిపాలన జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వలంటీర్ వ్యవస్థపై అసభ్యకరమంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు టమటమల గోపాలకృష్ణమూర్తి ,సచివాలయ కన్వీనర్‌లు వేణు, వర్ధనపు ప్రసంగి, కోటేశ్వరమ్మ, వార్డు సభ్యులు మధు, తవుడు, శివకుమారి, బొబ్బనపల్లి నందియ్య, జంగం ఇస్సాకు మహలక్ష్మీ, గ్రామ పెద్దలు మంతెన రాము, దండు సూరపరాజు,కాలా రామావతారం, సరేశ్వరరావు, వెలగపల్లి టోనీ,జంగం ఇస్సాకు, మానుకొండ నాగరాజు, జౌదుల రాజీవ్‌కుమార్, నాగేశ్వరరావు, జీ సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమికి రక్షణ కల్పించిన సీఎం జగన్

ఆకివీడు: అక్క చెల్లెమ్మల పేరున ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని సీఎం జగన్ చెప్పినట్లుగానే నేడు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చెప్పారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో సోమవారం 58 పట్టాల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాల్ని మోషేన్‌రాజు, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టా భూముల విలువను పెంపొందించేందుకు, శాశ్వత హక్కు పొందేందుకు రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు ఉపయోగపడతాయన్నారు. గత ప్రభుత్వాలు పేదలు ఇళ్ల స్థలాల్ని పంపిణీ చేయకుండా సొంతింటికల నెరవేరనివ్వకుండా చేశారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలకు చెందిన భూమిని ఐదేళ్ల వరకూ విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు. పేదల భూమికి భద్రత కల్పించారన్నారు. పేద ప్రజలకు అండగా ఉంటూ పలు సంక్షేమ పథకాల్ని అమలుజేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలిచి, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ వచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, సర్పంచ్ కోట అనంతలక్ష్మి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వానపల్లి బాబూరావు, చిక్కాల రామాంజనేయులు(చిన్నా) పుప్పాల పండు, అంబటి రమేష్, కత్తుల శ్రీనివాస్, అన్యెం శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాస్, పులగం రంగారావు, చొప్పల వెంకటేశ్, పశ్చెం అరుణ కుమారి, గాలి సామ్రాజ్యం, వానపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థాయిలో భీమవరం అభివృద్ధి

- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశాం
- పట్టణంలో లింకు రోడ్లు కూడా నిర్మించాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


31వ వార్డు బలుసుమూడిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణాన్ని కార్పొరేషన్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని అందులో భాగంగా ఇప్పటికే 100 కోట్లకు పైగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, మరిన్ని అభివృద్ధి పనులు జరగుతున్నాయని, మరో కొన్ని పనులకు టెండర్ ప్రక్రియ కూడా జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం భీమవరం పట్టణంలో 3. 25 కోట్లుతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా 2 వార్డు లోని టిడ్కో హౌస్ వద్ద రూ 18 . 60 లక్షలతో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ఆయన ప్రారంభించారు. 1 వార్డులో రూ. 18 లక్షలతో, 5 వార్డు నరసయ్య అగ్రహారం రూ. 18. 96 లక్షలతో, 6 వార్డు రూ. 22 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లుకు, 30 వవార్డులో రూ. 40 లక్షలతో హన్సి కల్యాణ మండపం జంక్షన్ నుంచి బలుసుమూడి రామాలయం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం 31వ వార్డులో 1. 71 కోట్లుతో బలుసుమూడి రామాలయం నుంచి ఆదిత్య కాలేజీ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఆయనకు ఆయా వార్డుల్లో మహిళలు, పెద్దలు, యువత ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కూడా పట్టణాన్ని అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. భీమవరం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకరం ఏంతో గొప్పదన్నారు. భీమవరం పట్టణాన్ని అన్నింటా అభివృద్ధి చేసి కార్పొరేషన్ స్థాయిలో నిలబెట్టాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లుతో పాటు లింకు రోడ్లు కూడా సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

పట్టణంలోని ఆరో వార్డు గాదిరాజు వారి వీధిలో లబ్ధిదారులకు స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలను ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు సంబంధించి సొంతింటి కలను నెరవేర్చడానికి 30 లక్షల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పంపిణీ చేశారన్నారు. భీమవరం నియోజకవర్గంలో 200 ఎకరాల వరకు భూమి సేకరణ చేసి పెద్ద ఎత్తున పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు.

రెండో వార్డులో పార్టీ జెండా ఆవిష్కరణ..

రెండో వార్డులో వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడవాడల వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందని ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. ప్రతి ఇంటికి నవరత్న పథకాలతో పాటు ఎన్నికల్లో చెప్పని హామీలను కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, ఎంతః త్రినాథ్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్.రాజు, కోడే యుగంధర్, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు రామరాజు, పాలవెలి మంగ, కట్టా రవి, పెన్మాడ శ్రీను, ములపర్తి స్వామి, కొప్పుల సత్తిబాబు, పెచ్చేటి ప్రసాద్, వర్మ,ముత్యాల బుజ్జి, బి. వాసు, పిప్పళ్ల నాని, తాళ్ళపూడి పరమేశ్వరరావు, గాదిరాజు సత్యనారాయణరాజు, గాదిరాజు హనుమంత్‌రాజు, కదలి రమేష్, తోట రాము, పోతినీడి సురేష్, బొక్కా నాని, గుబ్బల హనుమా, బెజవాడ సత్యనారాయణ, కముజ చిన్నా, రెడ్డి సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు..

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ అజిత

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ అజిత, కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,461 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలన్నారు. క్రిటికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల మధ్య వ్యత్యాసాన్ని విపులంగా వివరించారు. గత ఎన్నికల్లో ప్రత్యేక ఫోర్స్ లను వినియోగించడం జరిగిందని, ఇప్పటి నివేదికల ప్రకారం అదనంగా ఫోర్స్‌లను కోరడం జరిగిందన్నారు. పోలింగ్ స్టేషన్ల ప్రాంతాల వాస్తవ పరిస్థితులను మరోసారి బేరీజు వేసుకొని క్షుణంగా పరిశీలించుకోవాలన్నారు. అప్పుడు మాత్రమే తక్కువ ఫోర్స్ తో ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి వీలవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి.శివనారాయణ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, తణుకు పురపాలక సంఘం కమీషనరు బి.వెంకట రమణ, తణుకు తహశీల్దారు బి.యంముక్తేశ్వర రావు, పోలీసు అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంటు సి.హెచ్.దుర్గా ప్రసాదు, డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసి రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికలలో నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకమైనదని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో తాడేపల్లి గూడెం, తణుకు నియోజకవర్గాల సెక్టార్ అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ ఎన్నికల సంఘం నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కషి చేయాలన్నారు. సెక్టార్ అధికారుల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను ఒకటికి, రెండుసార్లు పరిశీలించుకుని సిద్ధంగా ఉండాలన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్. అప్పారావు, తణుకు పురపాలక సంఘం కమీషనరు బి.వెంకట రమణ, తణుకు తహసీల్దారు బి.యం.ముక్తేశ్వర రావు, ఎలక్షన్ సూపరింటెండెంటు సి.హెచ్.దుర్గా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు ఎం.సన్యాసి రావు, తాడేపల్లి గూడెం, తణుకు సెక్టారు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం


ఏలూరుపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభిస్తున్న పీవీఎల్

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పరిపాలన చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు స్పష్టం చేశారు. ఏలూరుపాడు గ్రామంలో రూ. 50 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే నాడు -నేడు రూపంలో పాఠశాలలకు గాని రహదారులు, సీసీ డ్రెయినేజీ, వంతెనలు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను సైతం నిర్మించగలుగుతున్నామంటే ఆ గొప్పతనం అంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.ప్రతి ఇంటిలోనూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమం పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఆమోదయోగ్యమైన అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలతో మేనిఫెస్టో విడుదల చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జడ్పిటిసి పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీటీసీ చిన్నపరపు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస రాజు, దాట్ల బాపిరాజు, మంతెన రవి వర్మ,మంతెన రామకృష్ణంరాజు, బండ్రెడ్డి ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

ఉండి: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉండి, ఆకివీడు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై జేసీ సమావేశమైయ్యారు. ఉండి(60)అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి భీమవరం విష్ణు కాలేజ్, సీతా పాలిటెక్నిక్ కాలేజ్ బిల్డింగ్ రెండవ అంతస్థులో స్ట్రాంగ్ రూం, బాట్మింటన్ కోర్టు, ఒకటి,రెండు భాగాల్లో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అభ్యర్థులు, వారి ఖర్చులు మూడుసార్లు వ్యయ పరిశీలనకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా అక్రమంగా నగదు గాని వస్తువులు గాని రవాణా లేదా పంపిణీ చేస్తున్నట్లయితే వెంటనే ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఈఎస్ఎంఎస్) యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పోలింగ్‌కి రెండు లేదా మూడు రోజుల ముందుగా ఎక్కువ నేరాలు జరిగే అవకాశం ఉంటుంది కనుక అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు బాగా, ఏదైనా అనుమానం ఉంటే సంబంధిత నోడల్ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు పగడ్బందీగా పని చేయాలని జేసీ సూచించారు.

ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయం

- 'వైనాట్ 175' ఆశయం నెరవేరనుంది
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు వెల్లడి


పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: మరో రెండు నెలల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయం నెరవేరనుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీకి కంచుకోటలుగా చెప్పుకుంటున్న ఐదారు నియోజకవర్గాలు కూడా కుప్పకూలిపోతాయన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించనుందని చెప్పారు. ఫ్యాన్ గాలితో వచ్చే సునామీలో జతకట్టిన రెండు పార్టీలూ అడ్రస్ లేకుండా ఎగిరిపోతాయన్నారు. టీడీపీకి ఎంత మంది పీకేలు మద్దతుగా నిలిచినా వారికి ఓటమి తప్పదని అన్నారు. జగన్ ప్రభంజనంను ఆసరాగా తీసుకుని ఆనాడు పీకే (ప్రశాంత్ కిషోర్) లబ్ధిపొందారన్నారు. తన ప్రమేయంతోనే గెలుపొందారని చెప్పడం విడ్డూరమన్నారు. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ మద్దతుతో చంద్రబాబుకు 23 సీట్లు వచ్చాయని, రాబోయే ఎన్నికల్లో ఆ రెండంకెల్లో ఒక అంకె కూడా దక్కదని నర్సింహరాజు అన్నారు. ప్రజాక్షేత్రంలో జగన్‌కు తిరుగులేదన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలుజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాయన్నారు. ఆయా సంక్షేమ పథకాల వైపు దేశమంతా చూస్తుందన్నారు. విప్లవాత్మకమైన మార్పులతో పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ తీసుకున్న చరిత్రాత్మక విధానాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. రైతన్నల్లో సంతోషం, ఆడపడుచుల్లో ఆనందం, ఫించన్‌దారుల్లో ఉత్సాహం, పేదల సొంతింటి కల నెరవేరడం వంటి వాటితో జగనన్న పాలన అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం నింపుతోందని నర్సింహరాజు చెప్పారు.

టెట్‌కు 92 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెంలో సోమవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 92 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. రెండు షిఫ్టులలో నిర్వహించిన ఈ పరీక్షకు 543 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 501 మంది హాజరయ్యారని, 42 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు


గుమ్ములూరు రామాలయంలో ప్రత్యేక పూజలు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పీవీఎల్

ఆకివీడు: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, నిధులు కేటాయిస్తుందని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చెప్పారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలోని పురాతన రామాలయాన్ని పునః ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన మోషేన్‌రాజు మాట్లాడుతూ అన్ని మతాల దేవాలయాల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. గుమ్ములూరు రామాలయంకు టీటీడీ నిధులు రూ. 10 లక్షలు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. గ్రామ మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వానపల్లి బాబూరావు మాట్లాడుతూ రామాలయం సమీపంలో కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామస్తులు ప్రతిపాదించారని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్య కుమారి

కాళ్ల: బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే. సూర్య కుమారి తెలిపారు.మహిళా దినోత్సవం సందర్భంగా సీసలి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ సెంటర్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి, ఎఎన్ఎం మేరీ, అంగన్‌వాడీ కార్యకర్త సిహెచ్ రామ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే వారోత్సవాలు


భీమవరంలో ప్రదర్శన చేస్తున్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది

భీమవరం: ఉమెన్స్ డే వారోత్సవాల్లో భాగంగా భీమవరంలో యూనియస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సోమవారం జువ్వలపాలెం రోడ్డులోని బ్యాంకు రీజినల్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు బ్యాంకు సిబ్బంది, వినియోగదారులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పెద అమిరంలోని అరుణోదయ మనోవికాస కేంద్రానికి ఇన్వర్టర్స్, బ్యాటీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ హెడ్ పి సంగీతకుమారి, డీఆర్‌హెచ్ ఆర్ దివాకర్, ఎస్ఎస్‌పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 8 ఫిర్యాదులు

ఆకివీడు: మండలంలోని నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 8 ఫిర్యాదులు వచ్చినట్లు మండల పరిషత్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బదలాయించినట్లు తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందన అర్జీదారులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న అల్పాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల అల్పాహారం, మజ్జిగను స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టరు చేతుల మీదుగా స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డా.రామభద్రి రాజుని, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.